జ్వాల
# దశ
నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM
శనివారం
1-08-2026
సంపుటి 1 సంచిక 249
పేజీలు : 04
వెల : 1/-
PRGI No : TGTEL/25/A4195




4లో

## ఎస్ఐఆర్ గడువు మరోసారి పొడిగింపు



### ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారుల 25 శాతం రాయితీకి
## మరో 4 నెలల గడువు

**దశ, హైదరాబాద్:** ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) దరఖాస్తుదారులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ఎల్ఆర్ఎస్ ఫీజులు, ఛార్జీల చెల్లింపుపై అమలులో ఉన్న 25 శాతం రాయితీని మరో నాలుగు నెలలు కొనసాగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆగస్టు 1 నుంచి నవంబర్ 30, 2026 వరకు 25 శాతం రిబేట్ వర్తించేలా ప్రభుత్వం జీఓ ఎంఎస్ నెం.213ను జారీ చేసింది. మెట్రోపాలిటన్ ఏరియా అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్

..మిగతా 4వ పేజీలో →



### ఈ-కేవైసీ గడువు
## ఆగస్టు 31 వరకు పొడిగింపు

**దశ, హైదరాబాద్:** రేషన్ కార్డు లబ్ధిదారులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. రేషన్ కార్డుల ఈకేవైసీ (eKYC) పూర్తి చేసేందుకు ఉన్న గడువును ఆగస్టు 31, 2026 వరకు మరో నెల రోజుల పాటు పొడిగించింది. ఈకేవైసీకి శుక్రవారం చివరి తేదీ కావడంతో పౌరసరఫరాల శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ఈకేవైసీ పూర్తి చేయకపోతే వెంటనే రేషన్ నిలిపివేస్తారనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో అధికారులు స్పష్టత ఇచ్చారు. ఆగస్టు 31 వరకు ఈకేవైసీ పూర్తి చేయకపోయినా రేషన్ సరుకులు పొందవచ్చని ప్రకటించారు. దీంతో రాష్ట్రంలోని లక్షలాది మంది రేషన్ కార్డు లబ్ధిదారులకు ఊరట లభించింది. ఇదిలా ఉండగా, ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన మూడు నెలల రేషన్‌ను ఒకేసారి పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. హైదరాబాద్ జిల్లా పరిధిలోని 8,43,607 ఆహార భద్రత కార్డుదారులకు 59,602.822 మెట్రిక్ టన్నుల బియ్యం, 7,279.513 మెట్రిక్ టన్నుల గోధుమలను కేటాయించినట్లు చీఫ్ రేషనింగ్ అధికారి రాజిరెడ్డి తెలిపారు. బియ్యాన్ని

..మిగతా 4వ పేజీలో →



## ఎఫ్ఐఆర్ రద్దు చేయండి

### హైకోర్టును ఆశ్రయించిన మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

**దశ, హైదరాబాద్:** తనపై నమోదైన లైంగిక వేధింపుల కేసును కొట్టివేయాలంటూ బీఆర్ఎస్ నేత, పినపాక మాజీ శాసనసభ్యుడు రేగా కాంతారావు న్యాయపోరాటానికి దిగారు. పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌ను రద్దు (క్వాష్) చేయాలని కోరుతూ ఆయన తెలంగాణ హైకోర్టు ఆశ్రయించారు. ఈ క్వాష్ పిటిషన్‌పై నేడు హైకోర్టు విచారణ జరపనుంది.యూట్యూబ్ ఇంటర్వ్యూ సాకుతో ఫ్లాట్‌కు పిలిపించి, ఆపై పెళ్లి చేసుకుంటానని నమ్మించి తనను వేధించారంటూ ఈ నెల 26న ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. బాధితురాలి ఆరోపణల

..మిగతా 4వ పేజీలో →



### విదేశాలకు వెళ్లే యువతకు తోడ్పాటుగా
# టామ్ కాం బాధ్యతలు

### డిమాండ్‌కు అనుగుణంగా నర్సింగ్ కళాశాలలకు అనుమతులు: సీఎం రేవంత్

**దశ, హైదరాబాద్:** విదేశాల్లో ఉద్యోగాలకు అవసరమైన శిక్షణ, ఉద్యోగ మేళాలతో పాటు వారికి అవసరమైన పాస్పోర్టు, ఆయా దేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించే బాధ్యతను టామ్కాం తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారు చెప్పారు. ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లే వారికి పాస్పోర్టులు ఇప్పించడంతో పాటు వారు వెళ్లే దేశాల్లోని మ్యాన్ పవర్ కంపెనీలతో ఒప్పందాలను టామ్కాం చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి శక్తి శాఖపై ఆ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి , ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఉత్తర తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులు మధ్య ప్రాచ్య దేశాలకు వెళుతుంటారని, ఈ క్రమంలో వారు ఏజెంట్ల చేతిలో మోసపోయి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. విదేశీ కంపెనీలతో టామ్కాం ఒప్పందం చేసుకోవడం ద్వారా అక్కడకు వెళ్లిన వారికి ఏవైనా ఇబ్బందులు ఎదురైతే చర్చలు జరపడానికి, వారికి న్యాయం చేయడానికి వీలుంటుందని అభిప్రాయపడ్డారు. "కార్మికులను విదేశాలకు తరలించే ఏజెంట్ల వివరాలు సేకరించి, వారు పంపించే ప్రతి వ్యక్తి వివరాలు నమోదు చేయాలి. ఈ వ్యవహారాల పర్యవేక్షణకు టామ్కాంకు మాజీ ఐఎఫ్ఎస్ అధికారిని సీఈవోగా నియమిస్తాం. ఉద్యోగాలకు వెళ్లే వారికి లైట్ మోటార్ వెహికల్, హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్లోనూ శిక్షణ

..మిగతా 4వ పేజీలో →


### రాత్రి పూట ఇడ్లీ బండి పెడితే
# జైలేనా..?

### మల్కాజిగిరి పోలీసుల తీరుపై విమర్శలు



**దశ, హైదరాబాద్:** హైదరాబాద్‌లో రాత్రిపూట ఇడ్లీ బండి నిర్వహిస్తున్న ఓ వీధి వ్యాపారిని మల్కాజిగిరి పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచడం వివాదాస్పదంగా మారింది. ఈ ఘటనలో వ్యాపారికి రెండు రోజుల జైలు శిక్ష విధించబడినట్లు సమాచారం. దీనిపై సోషల్ మీడియాలో తీవ్ర చర్చ జరుగుతుండగా, పోలీసుల చర్యలపై పలు వర్గాల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ చర్యను మల్కాజిగిరి పోలీసులు తమ అధికారిక ఎక్స్ (X) ఖాతాలో పోస్టు చేయగా, నెటిజన్ల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో ఆ పోస్టును తొలగించినట్లు తెలుస్తోంది. పొట్టకూటి కోసం రాత్రిపూట టిఫిన్ బండి నిర్వహించే చిన్న వ్యాపారిపై ఇంత కఠిన చర్యలు తీసుకోవడం సమంజసం కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. హైదరాబాద్‌ను 24 గంటల కార్యకలాపాలతో కూడిన గ్లోబల్ సిటీగా, నైట్ ఎకానమీ కేంద్రంగా అభివృద్ధి చేస్తామని ప్రభుత్వం చెబుతున్న సమయంలో, రాత్రివేళల్లో సేవలు అందించే చిరు వ్యాపారులపై ఇలాంటి చర్యలు తీసుకోవడం

..మిగతా 4వ పేజీలో →



## రాష్ట్రంలో వైన్ టూరిజానికి అవకాశాలు

### అమెరికా వైనరీని పరిశీలించిన మంత్రి జూపల్లి

**దశ, హైదరాబాద్:** తెలంగాణలో వైన్ టూరిజం అభివృద్ధికి ఉన్న అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు అబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. అమెరికా పర్యటనలో భాగంగా వర్జీనియా రాష్ట్రంలోని లీస్‌బర్గ్‌లో ఉన్న స్టోన్ టవర్ వైనరీని సందర్శించిన మంత్రి, అక్కడి నిర్వహణ,

..మిగతా 4వ పేజీలో →



## 16 అడుగులకే గణేశ్ విగ్రహాలు..

### నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

**దశ, హైదరాబాద్:** వినాయక నవరాత్రోత్సవాల నేపథ్యంలో గణేశ్ విగ్రహాల తయారీదారులకు హైదరాబాద్ పోలీసులు కీలక మార్గదర్శకాలు జారీ చేశారు. గణేశ్ విగ్రహాల గరిష్ట ఎత్తు 16 అడుగులకు మించకూడదని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. పర్యావరణహితంగా ఉత్సవాలు నిర్వహించేందుకు మట్టి విగ్రహాల తయారీకి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గణేశ్ ఉత్సవాలు సమీపిస్తున్న నేపథ్యంలో విగ్రహాల తయారీదారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో సీపీ సజ్జనార్ భద్రతా అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. గత ఏడాది హైదరాబాద్

..మిగతా 4వ పేజీలో →

## ఫార్ములా ఈ-రేసు కేసు..

4లో

### కేటీఆర్ ఏసీబీ కోర్టుకు హాజరు

## పెద్ది మృతి తెలంగాణకు తీరని లోటు



### కేసీఆర్, కేటీఆర్ సంతాపం

వివరాలు 4లో




## నగరంలో తొలి స్టార్ బక్స్ కాఫీ హౌస్

4లో

## పదవీ విరమణ చేసిన
# పోలీసు అధికారులకు ఘన సన్మానం

**దశ, మల్కాజ్‌గిరి:** మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్‌లో పదవీ విరమణ చేసిన ఏడుగురు పోలీసు అధికారులకు కమిషనర్ శ్రీమతి బి. సుమతి, ఐపీఎస్ ఘనంగా సన్మానం చేశారు. సీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అధికారుల సేవలను కొనియాడుతూ వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీపీ బి. సుమతి మాట్లాడుతూ, పదవీ విరమణ పొందుతున్న అధికారులు తమ ఉద్యోగ జీవితమంతా పోలీసు శాఖకు విశేష సేవలు అందించారని ప్రశంసించారు. వారికి ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని పదవీ విరమణ ప్రయోజనాలు ఎలాంటి జాప్యం లేకుండా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పదవీ విరమణ పొందుతున్న అధికారుల పాత్ర ఎంతో కీలకమైందని పేర్కొన్న సీపీ, వారి అంకితభావం, క్రమశిక్షణ, సేవా తపన పోలీసు శాఖకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతూ, సమాజ సేవలో భాగస్వాములు కావాలని, తమ అనుభవాన్ని సమాజానికి ఉపయోగపడేలా వినియోగించాలని సూచించారు. పదవీ విరమణ అనేది ఉద్యోగానికి ముగింపు మాత్రమేనని, సేవా భావానికి కాదని పేర్కొన్న సీపీ, మంచి ఆరోగ్యంతో కొత్త జీవితాన్ని ప్రారంభించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పదవీ విరమణ చేసిన అధికారుల కుటుంబ సభ్యులు, సహచరులు పాల్గొనడంతో కార్యక్రమం భావోద్వేగ వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో డీసీపీ (అడ్మిన్) శ్రీమతి ఇందిర, డీసీపీ (స్పెషల్ బ్రాంచ్) నరసింహారెడ్డి, ఏసీపీ (స్పెషల్ బ్రాంచ్) రవీంద్రరెడ్డి, సీఏఓలు శ్రీనివాస్, శ్రీనివాస్, సీహెచ్ భద్రారెడ్డి, పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తదితరులు పాల్గొని పదవీ విరమణ చేసిన అధికారులను అభినందించారు.



**పదవీ విరమణ పొందిన అధికారులు:**


పి. ముత్తయ్య - ఎస్ఐ, ఉప్పల్ ట్రాఫిక్
ఎం. శ్రీనివాస్ - ఎస్ఐ, వీఆర్
డి. సుధాకర్ - ఎస్ఐ, నేరేడ్మెట్
టి.వి. చల్మయ్య - అసిస్టెంట్ రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్
ఆర్. పాండురంగం - అసిస్టెంట్ రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్
సయ్యద్ హస్మత్ - అసిస్టెంట్ రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్
కే. గోపాల్ - అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్



# ఆపరేషన్ ముస్కాన్-XIIలో 80 మంది బాలల రక్షణ

**దశ ఓయూ:** బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనతో పాటు బాల్య వివాహాల నిరోధమే లక్ష్యంగా మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిర్వహిస్తున్న ఆపరేషన్ ముస్కాన్-XIIలో భాగంగా ఉప్పల్ సబ్‌డివిజన్‌లో విస్తృత తనిఖీలు చేపట్టారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉప్పల్, నాచారం, కుషాయిగూడ పోలీస్ స్టేషన్ల పరిధిలోని హోటళ్లు, వర్క్‌షాప్‌లు, వాణిజ్య సంస్థలు తదితర ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఉప్పల్ సబ్‌డివిజన్ ఏసీపీ వై. వెంకట్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ వై. రామలింగారెడ్డి, ఎల్‌బీనగర్ ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో, ఉప్పల్ ఎస్ఐ కె. ఇద్దయ్య నేతృత్వంలోని రెస్క్యూ బృందం జిల్లా బాలల రక్షణ విభాగం (డీసీపీ) సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టింది. ఈ సందర్భంగా బాల కార్మికులుగా పనిచేస్తున్న చిన్నారులతో పాటు బాల్య వివాహాలకు గురయ్యే అవకాశమున్న బాలబాలికలను గుర్తించి రక్షించారు. నిబంధనలు ఉల్లంఘించిన యజమానులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 15 ఎఫ్ఐఆర్‌లు, 21 జనరల్ డైరీ ఎంట్రీలు, నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో 9 ఎఫ్ఐఆర్‌లు, 14 జనరల్ డైరీ ఎంట్రీలు, కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో 5 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. మొత్తం 80 మంది బాలబాలికలను రక్షించి బాలల సంక్షేమ కమిటీ (సీడబ్ల్యూసీ) చైర్‌పర్సన్ ఎదుట హాజరుపరిచారు. కేసుల స్వభావాన్ని బట్టి సంబంధిత యజమానులు ఒక్కో బాలుడు లేదా బాలిక పేరుపై రూ.18 వేల నుంచి రూ.40 వేల వరకు డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జమ చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల రక్షణ విభాగం సభ్యులు సునీత, అనురాధ, సంధ్య, వరలక్ష్మి, షౌకత్ అలీ, రంజిత్, ఆశ్రితతో పాటు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి పద్మ పాల్గొన్నారు. బాల కార్మికులు లేదా బాల్య వివాహాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసు శాఖకు లేదా బాలల రక్షణ అధికారులకు తెలియజేసి బాలల భవిష్యత్తు పరిరక్షణకు ప్రజలు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# నకిలీ డీఏపీ ఎరువులపై అప్రమత్తం
## రైతులకు వ్యవసాయ శాఖ హెచ్చరిక




**దశ, హైదరాబాద్:** రాష్ట్రంలోని పలు జిల్లాల్లో నకిలీ డీఏపీ ఎరువుల విక్రయాలు వెలుగుచూడడంతో తెలంగాణ వ్యవసాయ శాఖ అప్రమత్తమైంది. రైతులు నకిలీ ఎరువులు కొనుగోలు చేసి నష్టపోతున్నట్లు ఫిర్యాదులు అందడంతో వెంటనే చర్యలు చేపట్టింది. నకిలీ ఎరువుల బారిన పడకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ సూచించింది. లైసెన్స్ పొందిన ఎరువుల డీలర్ల వద్ద మాత్రమే ఎరువులు కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన తర్వాత తప్పనిసరిగా బిల్లు తీసుకుని భద్రపరచుకోవాలని సూచించింది. తక్కువ ధరకు విక్రయిస్తున్నామంటూ రహదారుల పక్కన, లారీల్లో విక్రయించే ఎరువులను ఎట్టి పరిస్థితుల్లోనూ కొనవద్దని రైతులకు హెచ్చరించింది. అలాగే ఎరువుల సంచులపై తయారీ తేదీ, గడువు తేదీ, ఎంఆర్‌పీ (MRP) వివరాలను తప్పనిసరిగా పరిశీలించాలని తెలిపింది. అనుమానాస్పద ఎరువుల బస్తాలు కనిపిస్తే వెంటనే వ్యవసాయ అధికారులకు సమాచారం అందించాలని రైతులను కోరింది. అప్రమత్తతే రైతుల పెట్టుబడిని కాపాడుతుందని వ్యవసాయ శాఖ సంచాలకులు బి. గోపి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, రంగారెడ్డి, సూర్యాపేట, కరీంనగర్, నాగర్‌కర్నూల్, వికారాబాద్ జిల్లాల్లో నకిలీ ఎరువుల విక్రయాల ఘటనలు వెలుగులోకి వచ్చాయి. ఈ ఘటనల్లో సంబంధిత విక్రేతలపై కేసులు నమోదు చేసి, నిందితులను అరెస్ట్ చేశారు. వారు నిల్వ చేసిన నకిలీ ఎరువుల బస్తాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు వ్యవసాయ శాఖ వెల్లడించింది. జిల్లాల్లో టాస్క్‌ఫోర్స్ బృందాలు తనిఖీలను మరింత ముమ్మరం చేసి, నకిలీ ఎరువుల తయారీ, విక్రయాలపై కఠిన చర్యలు కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# రంగనాథ్‌కు అండగా రేవంత్..
## హైడ్రా కమిషనర్ వ్యవహారంలో న్యాయపోరుకు సిద్ధం

**దశ, హైదరాబాద్:** హైడ్రా కమిషనర్ ఐపీఎస్ అధికారి ఏవీ రంగనాథ్ నియామకంపై హైకోర్టు ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం తదుపరి చర్యలపై దృష్టి సారించింది. రంగనాథ్‌ను పదవి నుంచి తొలగించాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ప్రభుత్వం న్యాయపరంగా ముందుకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం హైడ్రా పనితీరుపై పూర్తి విశ్వాసం వ్యక్తం చేస్తూ, రంగనాథ్‌ను అదే బాధ్యతల్లో కొనసాగించాలనే అభిప్రాయంతో ఉన్నట్లు తెలుస్తోంది.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో చెరువుల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు, అక్రమ నిర్మాణాల నియంత్రణ లక్ష్యంగా హైడ్రా వ్యవస్థను బలోపేతం చేసింది. ఈ కార్యక్రమంలో కమిషనర్ రంగనాథ్ కీలక పాత్ర పోషిస్తూ పలు చర్యలు చేపట్టారు. అయితే ఇటీవల కోర్టు ధిక్కరణ అంశంపై హైకోర్టు చేసిన వ్యాఖ్యలు, ఆయన నియామకంపై ఇచ్చిన ఆదేశాలు ఈ వ్యవహారాన్ని న్యాయపరంగా కీలక దశకు తీసుకెళ్లాయి. హైకోర్టు తీర్పు అనంతరం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, న్యాయ నిపుణులతో ప్రభుత్వం వరుస సమావేశాలు నిర్వహించినట్లు సమాచారం. అధికారుల నియామకం, బదిలీలు ప్రభుత్వ పరిధిలోని అంశమనే వాదనతో డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన ముగించుకుని వచ్చిన అనంతరం దీనిపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. రాజకీయంగా కూడా హైడ్రా ప్రభుత్వం ప్రతిష్టాత్మక కార్యక్రమంగా మారింది. ఈ వ్యవస్థ ద్వారా ఆక్రమణలపై కఠిన చర్యలు చేపట్టిన ప్రభుత్వం, ఇప్పుడు వెనక్కి తగ్గితే ప్రతిపక్షాలకు అవకాశం కల్పించినట్లవుతుందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. అదే సమయంలో కోర్టు ఆదేశాలను గౌరవిస్తూ ప్రభుత్వ పరిపాలనా అధికారాలను కాపాడుకునే దిశగా న్యాయపోరాటం చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. హైడ్రా కమిషనర్ వ్యవహారంపై డివిజన్ బెంచ్‌లో ప్రభుత్వం ఎలాంటి వాదనలు వినిపిస్తుంది, కోర్టు తుది నిర్ణయం ఎలా ఉండబోతోందన్న అంశంపై రాజకీయ, పరిపాలనా వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఈ వ్యవహారం తెలంగాణ రాజకీయాలతో పాటు అధికారుల నియామక విధానాలపై కూడా ప్రభావం చూపే అవకాశముందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి

# బుల్లెట్ బండ్లపై కొరడా..
## అధిక శబ్దం చేసే వాహనాలపై స్పెషల్ డ్రైవ్
## ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి



**దశ సూర్యాపేట ప్రతినిధి :** ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తూ అధిక శబ్దంతో రోడ్లపై సంచరిస్తున్న మోడిఫైడ్ సైలెన్సర్లతో కూడిన బుల్లెట్ మోటార్‌సైకిళ్లపై సూర్యాపేట ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన కూడళ్లు, రహదారులపై విస్తృతంగా తనిఖీలు చేపట్టి నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలపై చర్యలు తీసుకున్నారు. తనిఖీల సందర్భంగా మోడిఫైడ్ సైలెన్సర్లతో అధిక శబ్దం చేస్తున్న బుల్లెట్ బైక్‌లను గుర్తించి మోటారు వాహన చట్టం ప్రకారం జరిమానాలు విధించారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా అమర్చిన సైలెన్సర్లను తొలగించే ప్రక్రియను కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి మాట్లాడుతూ, అధిక శబ్దం చేసే సైలెన్సర్ల వల్ల విద్యార్థులు, వృద్ధులు, రోగులు, సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వాహనదారులు చట్టాలను గౌరవిస్తూ నిబంధనలకు అనుగుణంగా వాహనాలను నడపాలని, ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా వాహనాల్లో మార్పులు చేయవద్దని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై ప్రత్యేక డ్రైవ్ నిరంతరం కొనసాగుతుందని, శబ్ద కాలుష్యాన్ని ప్రోత్సహించే మోడిఫైడ్ సైలెన్సర్ల వినియోగంపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల ప్రశాంతతను కాపాడటం, శబ్ద కాలుష్యాన్ని నియంత్రించడం, రోడ్డు భద్రతను మెరుగుపరచడం లక్ష్యంగా ఈ ప్రత్యేక తనిఖీలు కొనసాగనున్నట్లు ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు.




# ఎస్ఐఆర్ దరఖాస్తుల సమర్పణకు మూడు రోజులే

**దశ ఓయూ:** ఓటు హక్కును కాపాడుకునేందుకు ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియలో భాగంగా తీసుకున్న ఎన్యూమరేషన్ ఫారాలను ఆగస్టు 3లోగా తప్పనిసరిగా సమర్పించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సాయిజెన్ శేఖర్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత 20 రోజులుగా నాచారంలోని పలు ప్రాంతాల్లో ఎస్ఐఆర్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసి ఎన్యూమరేషన్ ఫారాల నింపడం, సమర్పణపై సహాయం అందిస్తున్నామని తెలిపారు. అన్నపూర్ణ కాలనీ కమ్యూనిటీ హాల్ ఎదుట ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లో స్థానికుల నుంచి ఎన్యూమరేషన్ ఫారాలను స్వీకరించారు. కార్యక్రమంలో విట్టల్ యాదవ్, కట్ట బుచ్చన్న గౌడ్, దేవులపల్లి యాదగిరి, చంద్రశేఖర్, పెంటయ్య, శ్రీనివాస్, హరి ప్రసాద్, భాగ్య, అరుణ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



# సమాజం గర్వించదగ్గ ఉపాధ్యాయుడు శ్రీ మాన్ రెడ్డి

**దశ సూర్యాపేట ప్రతినిధి :** సహచర ఉపాధ్యాయులకు మార్గ నిర్దేశం చేస్తూ, ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సంఖ్యను పెంచి సమాజానికి ఆదర్శంగా నిలిచిన ఉపాధ్యాయుడు శ్రీమాన్ రెడ్డి అని సూర్యాపేట మండల విద్యాధికారి శేషగాని శ్రీనివాస్ గౌడ్ అభినందించారు. శుక్రవారం మండల పరిధిలోని రామవరం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీమాన్ రెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తీగల వెంకన్న, ఉపసర్పంచ్ పల్స వెంకన్న, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ధైత పాపయ్య, పి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు తంగెళ్ల జితేందర్ రెడ్డి, మండల అధ్యక్షులు వల్లెం శంకర్ ప్రసాద్ తదితరులు పాల్గొనగా గ్రామ ప్రజలు, ఇతర పాఠశాలలో ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరై శ్రీ మాన్ రెడ్డి ని ఘనంగా సత్కరించారు.




# పేద ఆర్యవైశ్యులకు ఆర్థిక సహాయం అందించిన మాడుగుల నవీన్ కుమార్

**దశ సూర్యాపేట ప్రతినిధి :** సూర్యాపేట పట్టణానికి చెందిన పేద ఆర్యవైశ్యులకు సూర్యాపేట పట్టణ యువజన విభాగం అధ్యక్షులు మాడుగుల నవీన్ కుమార్ తన దాతృత్వాన్ని చాటుకున్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని నూతన వ్యవసాయ మార్కెట్ లో అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న మిట్ట లక్ష్మీతోపాటు చదువులో రాణిస్తూ ఆర్థికంగా వెనుకబడి ఉన్న కందిబండ అనిల్ కుమార్, బుస్సా జ్ఞాన సాయి, బుద్ద శరత్ కుమార్ ,కొండూరు రవి లకు విద్య వైద్యం నిమిత్తం 20 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడి ఉన్న ఆర్యవైశ్యులకు ప్రోత్సాహం అందించుటకు సూర్యాపేట పట్టణ యువజన సంఘం ముందు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బేలిదే శ్రీనివాసులు, గౌరవ సలహాదారులు ఉప్పల సత్యనారాయణ ఆర్గనైజింగ్ సెక్రటరీ సోమ ప్రవీణ్ పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం కార్యదర్శి బోనాల నాగరాజు కోశాధికారి బచ్చు జగన్ ఉపాధ్యక్షులు పాలవరపు శ్రీనివాస్ సంయుక్త కార్యదర్శి లు ఉప్పల రాజశేఖర్ , ఉప్పల రాజేష్, సోమశేఖర్, మొరిశెట్టి నాగరాజు, వంగవీటి కిరణ్ తదితరులు పాల్గొన్నారు

# నాచారం హెచ్ఎంటి నగర్ లో ఓటరు జాబితా సవరణపై ప్రత్యేక సహాయ కేంద్రం..కాంగ్రెస్ నాయకురాలు సోమ భావన గౌడ్.

**దశ ఓయూ:** హెచ్ఎంటి నగర్ డివిజన్ లోని అన్నపూర్ణ కాలనీలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా నింపిన ఎన్యుమరేషన్ ఫారాల సమర్పణకు ఆగస్టు 3 చివరి తేదీగా అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో నాచారం 22వ డివిజన్‌లో ప్రత్యేక సహాయ కేంద్రాన్ని కాంగ్రెస్ నాయకురాలు సోమ భావన గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి, ఓటర్లకు అవసరమైన మార్గదర్శకాలు అందిస్తున్నారు. 2002 ఆఫ్‌లైన్ ఓటరు జాబితా కూడా అందుబాటులో ఉంచినట్లు కాంగ్రెస్ నాయకురాలు సోమ భావన గౌడ్ పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ వివరాలను పరిశీలించి, అవసరమైన సవరణలు, చేర్పులు, తొలగింపుల కోసం గడువులోపు ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించాలని సూచించారు.ఈ సందర్భంగా హెచ్‌ఎంటీ నగర్ 22వ డివిజన్ కాంగ్రెస్ నాయకురాలు సోమ భావన గౌడ్ మాట్లాడుతూ, "ఓటు మన ప్రాథమిక హక్కు. దానిని కోల్పోకుండా ప్రతి అర్హుడూ ఓటరు జాబితాలో తన పేరు నమోదై ఉందో లేదో తప్పకుండా పరిశీలించుకోవాలి. తప్పనిసరిగా గడువులోపు దరఖాస్తులు సమర్పించాలి" అని విజ్ఞప్తి చేశారు.



# పేదల భూములను ప్రభుత్వం లాక్కోవాలని చూస్తోంది: బీజేపీ



**దశ, ఎల్బీనగర్:** రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండల పరిధిలోని అమన్‌గల్-హయత్‌నగర్ ముదిరాజ్ కాలనీలో ఉన్న భూముల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు అన్యాయం చేస్తోందని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఎల్బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి సామ రంగారెడ్డి మాట్లాడుతూ, సర్వే నంబర్ 255/1లో మొత్తం 74 ఎకరాల భూమి ఉండగా, అందులో 18 ఎకరాల భూమిపై ప్రస్తుతం వివాదం నెలకొన్నట్లు తెలిపారు. 1975లో అప్పటి ప్రభుత్వం ప్రభుత్వ భూముల్లో సాగు చేస్తున్న రైతులకు పట్టా పుస్తకాలు జారీ చేసిందని ఆయన పేర్కొన్నారు. అనంతరం కొంతమంది రైతులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా భూమిలో కొంత భాగాన్ని 60 గజాల చొప్పున ప్లాట్లుగా విభజించి పేద ప్రజలకు విక్రయించగా, మరికొంత భూమి ఇప్పటికీ రైతుల ఆధీనంలోనే ఉందని వివరించారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తోందని సామ రంగారెడ్డి ఆరోపించారు. పేద ప్రజలకు న్యాయం చేయాల్సిన ప్రభుత్వమే వారి భూములను తీసుకునేందుకు ప్రయత్నించడం బాధాకరమని అన్నారు. పేదల భూములను వారికి రక్షించే వరకు బీజేపీ పార్టీ వారి తరఫున పెద్దఎత్తున ఉద్యమం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్ళెం నవజీవన్ రెడ్డి, రైతులు, ప్లాట్ల యజమానులు తదితరులు పాల్గొన్నారు.




# మిగిలిన 3 రోజులను ప్రతీ ఓటరు సద్వినియోగం చేసుకోవాలి

## బీజేపీ బిఎల్ఏ-1 (BLA1) పోతగాని గోపాల్ గౌడ్ పిలుపు

**దశ ఓయూ:** భారత ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సంక్షిప్త సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ గడువు ముగియడానికి మరో మూడు రోజులు మాత్రమే మిగిలి ఉన్న నేపథ్యంలో అర్హులైన ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ బీఎల్ఏ1 పోతగాని గోపాల్ గౌడ్ కోరారు. ఇంకా ఓటరుగా నమోదు చేసుకోని 18 ఏళ్లు నిండిన యువత వెంటనే దరఖాస్తు చేసుకోవాలని, అలాగే పేరు, చిరునామా, ఫొటో తదితర వివరాల్లో మార్పులు ఉన్నవారు సంబంధిత ఫారమ్‌ల ద్వారా సవరణలు చేసుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో సరైన వివరాలు నమోదు కావడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. సమీపంలోని బీఎల్ఓలు, పార్టీ బీఎల్ఏలు లేదా ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లను సంప్రదించి దరఖాస్తులను గడువులోపు సమర్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ల ద్వారా ఓటర్లకు నమోదు, వివరాల సవరణ, ఫారమ్‌ల నింపడం వంటి సేవలను బీజేపీ నాయకులు, కార్యకర్తలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్‌తో పాటు యోగేశ్వర్ రెడ్డి, హనుమంత్ బిరాధర్, రాజిరెడ్డి, క్రాంతి కుమార్, వేణుగోపాల్ రెడ్డి, వెంకట్ నాయక్, శేఖర్ గుప్తా, డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు మంజులవాణి తదితరులు పాల్గొన్నారు.

# 45 రోజులకు పథకాలపై సమీక్ష

## పేదల కోసం ఎంతదూరమైనా వెళ్తా: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి





**దశ, అబ్దుల్లాపూర్‌మెట్:** ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హులైన లబ్ధిదారునికి చేరేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని, ప్రజలను ఇబ్బందులకు గురిచేసే అధికారులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హెచ్చరించారు. గ్రామాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, స్థానిక సమస్యల పరిష్కారంపై ప్రతి 45 రోజులకు సమీక్ష సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అబ్దుల్లాపూర్‌మెట్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల ప్రజా పరిషత్ సమావేశంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రత్యేక అధికారి శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గడ్డిఅన్నారం ఏఎంసీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ జైపాల్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ భాస్కరాచారి, మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం యాచారం మండల పరిషత్ కార్యాలయంలో కూడా ఎమ్మెల్యే మరో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీల అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పనితీరు, శాఖల మధ్య సమన్వయంపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. సర్పంచులు లేవనెత్తిన సమస్యలను విని సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కార మార్గాలను సూచించారు. భూసమస్యలు, ఆక్రమణలు, అక్రమ అనుమతుల విషయంలో రాజీ ఉండదని స్పష్టం చేశారు. పేదల కష్టాలు తనకు బాగా తెలుసని, వారి కోసం ఎంతదూరమైనా వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నానని ఎమ్మెల్యే అన్నారు. ప్రతి రోజు వందలాది మంది ప్రజలు తనను కలుస్తున్నారని, క్షేత్రస్థాయిలోనే అధికారులు సమస్యలను పరిష్కరిస్తే ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదన్నారు. అభివృద్ధి పనులకు నిధుల కొరత రాకుండా చూడటం తన బాధ్యత అని హామీ ఇచ్చారు. యాచారం మండలంలో భూసేకరణతో నష్టపోయిన రైతులకు న్యాయం జరుగుతుందని, పరిహారం పెంపు అంశాన్ని ముఖ్యమంత్రితో చర్చించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రైతుల పేరుతో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇబ్రహీంపట్నం చెరువు సుందరీకరణ, ఆస్పత్రి నిర్మాణం, రహదారుల అభివృద్ధికి రూ.338 కోట్ల నిధులు మంజూరు చేయించామని పేర్కొన్నారు. ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పిలుపునిచ్చారు.





# ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగు చేయాలి

## మండల వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు

**దశ, చౌటుప్పల్ :** ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది సాధారణం కంటే వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ అధికారులు సూచించారు. ఈ మేరకు చిన్న కొండూరు రైతు వేదికలో రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు మాట్లాడుతూ, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. మండలంలో వర్షపాతం తక్కువగా ఉన్నందున స్వల్పకాలిక పంటలైన కందులు, మినుములు, కూరగాయల సాగు చేపట్టడం రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సకాలంలో విత్తనాలు వేసి, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను పాటిస్తూ పంటల సాగు చేపట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో చిన్న కొండూరు గ్రామ సర్పంచ్ చంద్రయ్య, ఉప సర్పంచ్ సత్తయ్య, ఏఎంసీ డైరెక్టర్ వెంకటరెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి పల్లె వెంకటేశం, అధికారులు కె. సోనీ, హెచ్‌ఈఓ నరసింహతో పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్‌కు దరఖాస్తుల ఆహ్వానం




**దశ, రంగారెడ్డి:** వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబర్చిన చిన్నారులకు అందించే ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్ (PMRBP)-2026 కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా సంక్షేమ శాఖ (స్త్రీ, శిశు, వికలాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ) అధికారిణి శ్రీమతి జి. శాంతిశ్రీ తెలిపారు. క్రీడలు, నూతన ఆవిష్కరణలు, సామాజిక సేవ, పర్యావరణ పరిరక్షణ, కళలు-సంస్కృతి, సైన్స్ అండ్ టెక్నాలజీ తదితర రంగాల్లో అసాధారణ ప్రతిభ కనబర్చిన బాలురు, బాలికలు ఈ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు భారత పౌరులై ఉండటంతో పాటు భారతదేశంలో నివసిస్తూ, 15 ఆగస్టు 2026 నాటికి 5 సంవత్సరాలు పూర్తి చేసి, 18 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండాలని అధికారులు తెలిపారు. అర్హతలు, మార్గదర్శకాలు మరియు ఇతర పూర్తి వివరాలను నేషనల్ అవార్డ్స్ పోర్టల్ లో పరిశీలించి, అర్హులైన అభ్యర్థులు 2026 ఆగస్టు 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ సూచించింది.

# ఆగస్టు 2న 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్' సంకల్ప్ అభియాన్..

## తెలంగాణలో విస్తృత కార్యక్రమాలు

**దశ, రంగారెడ్డి :** మాదకద్రవ్యాల రహిత భారతదేశ నిర్మాణ లక్ష్యంతో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మై భారత్ తెలంగాణ ఆగస్టు 2న రాష్ట్రవ్యాప్తంగా "నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ - సంకల్ప్ అభియాన్" నిర్వహించనుంది. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ మహా ఉద్యమంలో భాగంగా తెలంగాణలో పలు విద్యాసంస్థలు, జిల్లాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు. రాష్ట్ర స్థాయిలో హైదరాబాద్‌లోని శ్రీనిధి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, రంగారెడ్డి జిల్లా సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్, సిద్ధిపేటలోని కావేరి యూనివర్సిటీ, వరంగల్‌లోని వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రధాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వీటితో పాటు మరో ఐదు జిల్లా కేంద్రాల్లో యువత, విద్యాసంస్థలు, ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, వాలంటీర్లు పాల్గొనే అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా యువతతో మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించడంతో పాటు అవగాహన ర్యాలీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, యువజన చర్చావేదికలు, కమ్యూనిటీ అవుట్‌రీచ్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై యువతలో చైతన్యం పెంపొందించి, డ్రగ్స్‌కు దూరంగా ఉండే సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునివ్వనున్నారు. దేశవ్యాప్తంగా 10 వేలకుపైగా కేంద్రాల్లో నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా యువతతో సంభాషించి "నషా ముక్త్ యువ ప్రతిజ్ఞ" చేయించనున్నారు. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా కోటి మందికిపైగా యువత పాల్గొనే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమం విజయవంతం కోసం జిల్లా యంత్రాంగం, విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, పాఠశాలలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, యువజన సంఘాలు, ప్రభుత్వ శాఖలు, ఆధ్యాత్మిక, స్వచ్ఛంద సంస్థలతో సమన్వయం చేస్తున్నట్లు మై భారత్ తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ చి. అన్వేష్ తెలిపారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి యువకుడు భాగస్వామి కావాలని, వికసిత్ భారత్-2047



# పదవీ విరమణ పొందిన ఎంఎంసీ జాయింట్ కమిషనర్‌కు స్వేరోస్ నేతల సన్మానం

**దశ ఓయూ:** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) జాయింట్ కమిషనర్ తిప్పర్తి యాదయ్య పదవీ విరమణ పొందిన సందర్భంగా స్వేరోస్ నాయకులు శుక్రవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. యాదయ్య దంపతులకు పుష్పగుచ్ఛం అందజేసి, వారి సేవలను కొనియాడుతూ సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్ నగర కార్యదర్శి కుమార్, జై భీమ్ యూత్ ఇండియా జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు ముక్కురాళ్ల శ్రీహరి, ఎమ్మార్వో మహిళా సంఘం అధ్యక్షురాలు రాధా, అరుణోదయ విమలక్కతో పాటు పలువురు స్వేరోస్ నాయకులు పాల్గొన్నారు.

# నేటి నుంచి ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు

## అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం

**దశ, రంగారెడ్డి :** ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ వెల్లడించింది. ఈ ఏడాది "తల్లిపాలకు ప్రాధాన్యత ఇద్దాం.. సుస్థిరమైన సహాయ వ్యవస్థలను ఏర్పాటు చేద్దాం" అనే ఇతివృత్తంతో జిల్లా, మండల, గ్రామ స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

తల్లిపాలు నవజాత శిశువుకు అత్యంత సంపూర్ణమైన మొదటి ఆహారమని, దీనిని *"ద్రవ స్వర్ణం"*గా అభివర్ణిస్తారని అధికారులు పేర్కొన్నారు. పుట్టిన మొదటి గంటలోనే తల్లిపాలు ఇవ్వడం వల్ల నవజాత శిశువుల మరణాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. తల్లిపాలు శిశువుకు అవసరమైన అన్ని పోషకాలు, రోగనిరోధక శక్తిని అందించి అతిసారం, న్యుమోనియా, ఇతర ఇన్ఫెక్షన్ల నుంచి రక్షించడంలో కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. తల్లిపాలు శిశువుల మెదడు, శారీరక ఎదుగుదలకు తోడ్పడటంతో పాటు ఆస్తమా, ఊబకాయం, టైప్1 మధుమేహం, ఆకస్మిక శిశు మరణ సిండ్రోమ్ (SIDS) వంటి సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తాయని తెలిపారు. పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, అనంతరం ఇతర పోషకాహారంతో పాటు రెండేళ్ల వరకు తల్లిపాలు కొనసాగించాలని సూచించారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లులకు కూడా అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని అధికారులు పేర్కొన్నారు. ప్రసవానంతరం రక్తస్రావం తగ్గడం, గర్భాశయం త్వరగా సాధారణ స్థితికి చేరడం, అదనపు కేలరీలు ఖర్చై బరువు నియంత్రణకు తోడ్పడటంతో పాటు టైప్2 మధుమేహం, గుండె జబ్బుల ప్రమాదం తగ్గుతుందని తెలిపారు. అలాగే ప్రసవానంతర డిప్రెషన్, ఒత్తిడి తగ్గడంతో పాటు తల్లి శిశువు మధ్య భావోద్వేగ బంధం మరింత బలపడుతుందని



వివరించారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీలు, సదస్సులు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ వెల్లడించింది. నీలోఫర్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన రాష్ట్ర తొలి మానవ పాల బ్యాంకు అకాల శిశువులకు ఎంతో ఉపయోగపడుతోందని పేర్కొంది. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తల ద్వారా గ్రామాల్లో గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యత, సరైన పాలిచ్చే విధానం, పోషకాహారంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపింది. తల్లిపాలు ఇవ్వడం కేవలం తల్లి బాధ్యత మాత్రమే కాకుండా కుటుంబం, సమాజం, ప్రభుత్వం అందరి ఉమ్మడి బాధ్యత అని మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ పేర్కొంది. ప్రతి శిశువుకు ఆరోగ్యకరమైన భవిష్యత్తు అందించాలంటే తల్లిపాల ప్రాధాన్యతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని పిలుపునిచ్చింది.

# విదేశాలకు వెళ్లే యువతకు తోడ్పాటుగా టామ్ కాం బాధ్యతలు

**మొదటి పేజీ తరువాయి**

ఇప్పించాలి" అని సూచించారు. "యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో నూతన ఆవిష్కరణలకు అవసరమైన రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలి. జర్మన్, జపనీస్, కొరియన్, చైనీస్, రష్యన్ తదితర భాషలు నేర్చుకునేందుకు వీలుగా స్కిల్ యూనివర్సిటీలో ప్రత్యేక విభాగాన్ని నెలకొల్పాలి" అని చెప్పారు. విదేశీ భాషలు నేర్పేందుకు స్థానికంగా ఆ భాషలో పట్టున్న వారితో పాటు ఆయా దేశాలకు చెందిన శిక్షకులను రప్పించాలని సూచించారు. ఉన్నత విద్యకు వెళ్లే విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్షిప్లు ఇచ్చినట్లే, బ్లూ కాలర్ జాబ్లకు శిక్షణ పొందేవారందరికీ స్కాలర్షిప్లు ఇచ్చే అంశంపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. "ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలు, ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు పెద్ద కంపెనీల్లో ఇంటర్న్షిప్ చేసే అవకాశం కల్పించాలి. ఓ వైపు చదువుకుంటూనే, మరో వైపు ఇంటర్న్షిప్ చేయడం ద్వారా వారికి స్టైఫండ్ లభిస్తుంది. భవిష్యత్తో చేయబోయే ఉద్యోగానికి సంబంధించిన నైపుణ్యాలు నేర్చుకుంటారు" అని చెప్పారు. "ఏటీసీల్లో ఈవీ సర్వీసులకు సంబంధించిన కోర్సులు, డ్రోన్ టెక్నాలజీ కోర్సులు ప్రవేశపెట్టాలి. ఈవీల వాడకం విపరీతంగా పెరిగిన నేపథ్యంలో వాటి సర్వీసింగ్ చేయగలిగిన వారు అవసరం. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం భారీగా పెరుగుతున్నందున డ్రోన్ టెక్నాలజీ కోర్సు ఉండాలి" అని సూచించారు. దేశీయంగానూ, విదేశాల్లోనూ నర్సుల సేవలకు భారీ డిమాండ్ ఉందని ముఖ్యమంత్రి గారు వివరించారు. పలు అభివృద్ధి చెందిన దేశాల్లో వృద్ధుల సంఖ్య పెరుగుతుండడంతో ఇంటికో నర్సు డిమాండ్ ఉందన్నారు. పెరుగుతున్న డిమాండ్కు అనుగుణంగా నర్సింగ్ కళాశాలలకు అనుమతులు ఇస్తున్నట్లు తెలిపారు.


## నల్గొండ కాంగ్రెస్‌లో డీసీసీ పీఠం రగడ

# కోమటి వర్గానిదే పైచేయి?

**బీసీ సమీకరణాలు వర్సెస్ వర్గపోరు.. నల్గొండలో కాంగ్రెస్‌కు కొత్త తలనొప్పి**

**మంత్రుల ఒత్తిడి.. హైకమాండ్‌కు సవాల్‌గా మారిన నల్గొండ డీసీసీ వ్యవహారం**

**నల్గొండ రాజకీయాల్లో కీలక మలుపు.. కాంగ్రెస్ నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి**




**దశ, నల్గొండ:** తెలంగాణ కాంగ్రెస్‌లో జిల్లా కాంగ్రెస్ కమిటీల (డీసీసీ) అధ్యక్షుల మార్పు వ్యవహారం రాజకీయంగా హాట్‌టాపిక్‌గా మారింది. ముఖ్యంగా నల్గొండ డీసీసీ అధ్యక్ష పదవిపై నెలకొన్న పరిణామాలు పార్టీలోని అంతర్గత విభేదాలను మరోసారి తెరపైకి తెచ్చాయి. ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడు పున్నా కైలాష్ నేతను మార్చే అవకాశాలపై జరుగుతున్న చర్చలు జిల్లా రాజకీయాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. పార్టీలో కోమటిరెడ్డి వర్గం మొదటి నుంచే పున్నా కైలాష్ నేత నాయకత్వంపై అసంతృప్తితో ఉందనే ప్రచారం సాగుతోంది. గతంలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా చోటుచేసుకున్న ప్రోటోకాల్ వివాదం, స్థానిక నాయకత్వంలో నెలకొన్న విభేదాలు ఈ అసంతృప్తిని మరింత బహిర్గతం చేశాయని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో డీసీసీ మార్పు వ్యవహారం కేవలం ఒక పదవి మార్పు కాకుండా, జిల్లాలో ఏ వర్గం ఆధిపత్యం కొనసాగుతుందనే అంశంగా మారింది. పున్నా కైలాష్ నేతకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మద్దతు ఉందనే ప్రచారం ఉన్నప్పటికీ, జిల్లాకు చెందిన కీలక మంత్రుల అభిప్రాయాలు కూడా ఈ వ్యవహారంలో ప్రభావం చూపుతున్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఒకవేళ అధ్యక్ష పదవిలో మార్పు జరిగితే అది జిల్లాలోని రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశముందని భావిస్తున్నారు. ఇక సామాజిక సమీకరణాల కోణం కూడా ఈ వ్యవహారంలో ప్రాధాన్యం సంతరించుకుంది. పున్నా కైలాష్ నేత బీసీ వర్గానికి చెందిన నాయకుడు కావడంతో, ఆయనను తప్పిస్తే బీసీ వర్గాలకు తప్పుడు సంకేతాలు వెళ్లే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం కులగణనకు ప్రాధాన్యం ఇస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఇలాంటి నిర్ణయం రాజకీయంగా ప్రతికూల ప్రభావం చూపవచ్చనే చర్చ పార్టీలో సాగుతోంది. త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో డీసీసీ మార్పు వ్యవహారం కాంగ్రెస్‌కు సవాల్‌గా మారింది. వర్గపోరును చల్లార్చుతూ అన్ని వర్గాలను సమన్వయం చేయాల్సిన అవసరం పార్టీ అధిష్టానంపై ఉందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. నిర్ణయం ఏదైనా తీసుకున్నా అది నల్గొండ జిల్లాతో పాటు రాష్ట్ర కాంగ్రెస్ రాజకీయాలపై ప్రభావం చూపే అవకాశముందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

## 16 అడుగులకే గణేశ్ విగ్రహాలు..

**మొదటి పేజీ తరువాయి**

కమిషనరేట్ పరిధిలో సుమారు 23 వేల గణేశ్ విగ్రహాలు ప్రతిష్ఠించినట్లు గుర్తుచేస్తూ, విగ్రహాల రవాణా సమయంలో జరిగిన ప్రమాదాల దృష్ట్యా ఈసారి మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విగ్రహాల తయారీ కేంద్రాల్లో అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు, సురక్షిత విద్యుత్ వైరింగ్ తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. లోడింగ్, అన్‌లోడింగ్ కోసం ఉపయోగించే క్రేన్లు, వాహనాలు అధికారికంగా ధ్రువీకరించినవే వినియోగించాలని స్పష్టం చేశారు. అలాగే చిన్న మట్టి విగ్రహాల ప్రతిష్ఠాపనపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. ధూల్‌పేట్, జల్‌పల్లి, మైలార్‌దేవ్‌పల్లి ప్రాంతాల నుంచి విగ్రహాల రవాణాకు ప్రత్యేక ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలను వినియోగించాలని సూచించిన సీపీ, రద్దీ సమయాల్లో భారీ విగ్రహాల రవాణా చేయవద్దని హెచ్చరించారు. ట్రాఫిక్ పోలీసుల ముందస్తు అనుమతి తీసుకుని, రవాణా మార్గాలు, సమయాల వివరాలను పోలీసులకు ముందుగానే తెలియజేయాలని ఆదేశించారు. విద్యుత్ తీగలు, ఫ్లైఓవర్లు, మెట్రో మార్గాలకు ఎలాంటి అంతరాయం కలగకుండా రవాణా నిర్వహించాలని స్పష్టం చేశారు. ఇక ఖైరతాబాద్ మహా గణపతిని ఈ ఏడాది 69 అడుగుల ఎత్తులో 'పంచముఖ సంకటహర మహాగణపతి' రూపంలో తీర్చిదిద్దుతున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. మరోవైపు సాధారణ గణేశ్ విగ్రహాల విషయంలో నిబంధనలు కచ్చితంగా అమలు చేస్తామని పోలీసులు స్పష్టం చేశారు.

## మర్రి చెన్నారెడ్డి పేరిట సనత్ నగర్ టిమ్స్ ఆసుపత్రి

**దశ, హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ సనత్ నగర్ లో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) కు ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి పేరును నామకరణం చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. తెలంగాణ ప్రాంతానికి చెందిన మర్రి చెన్నారెడ్డి రెండు పర్యాయాలు ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. యూపీ, పంజా, రాజస్థాన్, తమిళనాడు రాష్ట్రాలకు గవర్నర్ గా కూడా పదవులు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా ఆయన పార్టీలో కీలకపాత్ర పోషించారు.

# పేరుకుపోతున్న ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ దరఖాస్తులు

**దశ, హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన కుటుంబ రిజిస్టర్ సర్టిఫికెట్ (ఎఫ్ఆర్‌సీ) జారీ ప్రక్రియలో జాప్యం నెలకొంది. దరఖాస్తు చేసుకున్న రెండు పనిదినాల్లోనే ధ్రువీకరణ పత్రం అందజేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో గడువు పాటించకపోవడంతో వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో పడ్డాయి.ఈ పథకం ప్రారంభమైన జులై 27 నుంచి బుధవారం వరకు రాష్ట్రవ్యాప్తంగా మీసేవ కేంద్రాల ద్వారా 50 వేలకు పైగా దరఖాస్తులు అందాయి. తొలిరోజే దరఖాస్తు చేసుకున్న వారికి సైతం ఇప్పటివరకు సర్టిఫికెట్లు అందకపోవడంతో, వారు నిత్యం మీసేవ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. ఫలితంగా దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత నెల 25న విడుదల చేసిన జీవో 172 నిబంధనల ప్రకారం, దరఖాస్తు అందిన రెండు పనిదినాల్లోగా సంబంధిత తహశీల్దార్లు వాటిని పరిశీలించి సర్టిఫికెట్లను జారీ చేయాలి. అయితే, పలు ప్రాంతాల్లో ఈ నిబంధన అమలు కావడం లేదు.పౌరసరఫరాల శాఖ వద్ద ఉన్న రేషన్ కార్డుల సమాచారం ఆధారంగా ప్రభుత్వం 'తెలంగాణ ఫ్యామిలీ రిజిస్టర్'ను సిద్ధం చేసింది.

# పెద్ది మృతి తెలంగాణకు తీరని లోటు



**దశ, హైదరాబాద్:** తెలంగాణ ఉద్యమ సహచరుడు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పోషించిన పాత్రను గుర్తు చేసుకుంటూ, రాష్ట్ర సాధన కోసం చేసిన సేవలను కొనియాడారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో తనతో కలిసి నడిచిన ఆప్త మిత్రుడిని కోల్పోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ కోసం అంకితభావంతో పనిచేసిన పెద్ది సుదర్శన్ రెడ్డి రాజకీయ ప్రస్థానం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఆయన మరణం బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని తెలిపారు. కుటుంబ సభ్యులకు, అభిమానులకు, పార్టీ కార్యకర్తలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పోషించిన పాత్ర చిరస్మరణీయమని, ప్రజల పక్షాన నిలబడి పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. ఆయన మరణం బీఆర్ఎస్‌కే కాకుండా తెలంగాణ సమాజానికీ తీరని లోటని పేర్కొన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి చూపిన నిబద్ధత, ఉద్యమ స్ఫూర్తి పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ ఆదర్శంగా నిలుస్తాయని కేటీఆర్ తెలిపారు. "జోహార్ పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నా" అంటూ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.

# వైన్ టూరిజానికి అవకాశాలు

**మొదటి పేజీ తరువాయి**



వైన్ తయారీ విధానాలను పరిశీలించారు. వైనరీ సెల్లార్ టూర్‌లో పాల్గొన్న మంత్రి జూపల్లి, ద్రాక్ష సాగు నుంచి వైన్ తయారీ, ఫెర్మెంటేషన్, నిల్వ, బాట్లింగ్, నాణ్యత ప్రమాణాలు, మార్కెటింగ్ వరకు అనుసరిస్తున్న విధానాలపై ప్రతినిధులతో చర్చించారు. ద్రాక్ష తోటలను పర్యాటకంతో అనుసంధానిస్తూ సందర్శకులకు గైడెడ్ టూర్లు, హాస్పిటాలిటీ సేవలు, ప్రత్యేక అనుభూతులు కల్పిస్తున్న విధానాన్ని అధ్యయనం చేశారు. హైదరాబాద్‌కు సమీపంలోని రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ద్రాక్ష సాగు, వైనరీల ఆధారిత పర్యాటక అభివృద్ధికి మంచి అవకాశాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. ఆయా ప్రాంతాల వాతావరణ పరిస్థితులు, ద్రాక్ష సాగుకు అనుకూలత, పెట్టుబడి అవకాశాలను అధ్యయనం చేసి తదుపరి కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. వైన్ టూరిజం అభివృద్ధి ద్వారా ద్రాక్ష రైతులకు ప్రోత్సాహం లభించడంతో పాటు ప్రైవేటు పెట్టుబడులు ఆకర్షితమై స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ పర్యాటక విధానం 2025-30లో భాగంగా వినూత్న పర్యాటక ప్రాజెక్టులకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. తెలంగాణ టూరిజం కాన్‌క్లేవ్‌లో రూ.15 వేల కోట్లకు పైగా పెట్టుబడుల ప్రతిపాదనలు వచ్చినట్లు వెల్లడించిన మంత్రి, రాష్ట్రంలోనే తొలిసారిగా వైనరీ వాక్‌త్రూ అనుభూతితో కూడిన వైన్‌యార్డ్ రిసార్ట్ ఏర్పాటు ప్రతిపాదన కూడా ఉందన్నారు. ఇందులో ద్రాక్ష సాగు నుంచి వైన్ తయారీ, బాట్లింగ్ వరకు మొత్తం ప్రక్రియను సందర్శకులు ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం ఉండటంతో పాటు సంప్రదాయ పద్ధతిలో 'గ్రేప్ స్టాంపింగ్' అనుభూతిని కూడా అందించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయంగా విజయవంతమైన నమూనాలను అధ్యయనం చేసి, తెలంగాణకు అనువైన వైన్ టూరిజం నమూనాను నిబంధనలకు అనుగుణంగా అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. ఈ పర్యటనలో ప్రభుత్వ విప్ యెన్నెం శ్రీనివాస్ రెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

### ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారుల 25% రాయితీకి

## మరో 4 నెలల గడువు

**మొదటి పేజీ తరువాయి**

ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఎల్ఆర్ఎస్ బకాయిల చెల్లింపునకు కూడా మరో నాలుగు నెలల గడువు పొడిగించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ నిర్ణయాన్ని వెంటనే అమలు చేయాలని సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ గడువులో దరఖాస్తుదారులు రాయితీ ప్రయోజనాన్ని వినియోగించుకుని బకాయిలు చెల్లించాలని అధికారులు సూచించారు.

## ఎఫ్ఐఆర్ రద్దు చేయండి

**మొదటి పేజీ తరువాయి**

ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేయగా... ఈ వ్యవహారంపై రేగా కాంతారావు ఘాటుగా స్పందించారు.తనపై వచ్చిన ఆరోపణలన్నీ పూర్తిగా కల్పితాలని, కేవలం రాజకీయ ప్రతీకారంతోనే తన ప్రతిష్ఠను దిగజార్చేందుకు ఈ కుట్ర పన్నారని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. రాజకీయ దురుద్దేశంతో బనాయించిన ఈ కేసు నుంచి తనకు ఉపశమనం కలిగించాలని ఆయన కోర్టును అభ్యర్థించారు. నేటి విచారణలో న్యాయస్థానం ఏ నిర్ణయం తీసుకోబోతోందనేది తీవ్ర ఉత్కంఠగా మారింది.



### ఫార్ములా ఈ-రేసు కేసు..

## కేటీఆర్ ఏసీబీ కోర్టుకు హాజరు

**దశ, హైదరాబాద్:** ఫార్ములా ఈరేసు కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ శుక్రవారం నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు. ఈ కేసులో ఏసీబీ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌ను పరిగణనలోకి తీసుకున్న కోర్టు, కేటీఆర్‌తో పాటు మాజీ ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డికి సమన్లు జారీ చేసింది. న్యాయస్థానం ఆదేశాల మేరకు నిందితులు రూ.1 లక్ష పూచీకత్తుతో పాటు ఇద్దరు షూరిటీలను సమర్పించారు. అనంతరం కేసు విచారణను ఆగస్టు 25కు వాయిదా వేసింది. ఫార్ములా ఈరేసు నిర్వహణలో నిబంధనలకు విరుద్ధంగా రూ.55 కోట్లకు పైగా నిధులు విడుదల చేశారనే ఆరోపణలతో ఏసీబీ కేసు నమోదు చేసింది. అయితే ఈ ఆరోపణలను కేటీఆర్ ఖండిస్తూ, రాజకీయ కక్షసాధింపులో భాగంగానే కేసు నమోదు చేశారని ఆరోపించారు. న్యాయస్థానంపై పూర్తి విశ్వాసం ఉందని ఆయన తెలిపారు.




## నగరంలో తొలి స్టార్ బక్స్ కాఫీ హౌస్

**దశ, హైదరాబాద్:** హైదరాబాద్లో టాటా స్టార్ బక్స్ దక్షిణ భారతదేశంలో తొలి స్టార్బక్స్ రిజర్వ్ కాఫీహౌస్ను ప్రారంభించింది. జూబ్లీహిల్స్ రోడ్ నెం.45లో అందంగా పునరుద్ధరించిన బంగ్లాలో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక కాఫీహౌస్ను వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చింది. భారతదేశంలో ఆరో స్టార్ బక్స్ రిజర్వ్ స్టోర్గా నిలిచిన ఈ కాఫీహౌస్లో ప్రపంచవ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రత్యేక కాఫీలు, సిగ్నేచర్ పానీయాలు, ప్రత్యేక ఫుడ్ మెనూ, పెంపుడు జంతువులతో వచ్చే వినియోగదారులకు కూడా అనుకూలమైన సౌకర్యాలు ఉన్నాయి. ఈ సందర్భంగా టాటా స్టార్ బక్స్ సీఈఓ సుశాంత్ డాష్ మాట్లాడుతూ, హైదరాబాద్ తమకు కీలకమైన మార్కెట్ అని, జూబ్లీహిల్స్లో తొలి స్టార్ బక్స్ రిజర్వ్ స్టోర్ను ప్రారంభించడం ఆనందంగా ఉందని తెలిపారు.

## ఈ-కేవైసీ గడువు ఆగస్టు 31 వరకు పొడిగింపు

**మొదటి పేజీ తరువాయి**

ఉచితంగా, గోధుమలను కిలోకు రూ.7 చొప్పున పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆగస్టు 1 నుంచి 31 వరకు లబ్ధిదారులు తమ రేషన్ సరుకులను పొందవచ్చని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు, ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను దృష్టిలో ఉంచుకుని ఈకేవైసీ గడువును పొడిగించినట్లు పౌరసరఫరాల శాఖ తెలిపింది.

## 'ఎస్ఐఆర్' గడువు మరోసారి పొడిగింపు

**దశ, హైదరాబాద్:** తెలంగాణలో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు సంబంధించిన గడువును భారత ఎన్నికల సంఘం మరోసారి పొడిగించింది. ముందుగా నిర్ణయించిన గడువు ముగియనున్న నేపథ్యంలో దరఖాస్తుల స్వీకరణకు ఆగస్టు 10వ తేదీ వరకు అవకాశం కల్పిస్తూ ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. ఓటరు జాబితాల సవరణ ప్రక్రియలో భాగంగా కొత్త ఓటర్ల నమోదు, పేర్ల సవరణ, చిరునామా మార్పు, తొలగింపులు తదితర దరఖాస్తులను ఆగస్టు 10 వరకు స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ ఓటరు వివరాలను సరిచేసుకోవాలని ఎన్నికల అధికారులు సూచించారు. ఎన్నికల జాబితాలను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించే లక్ష్యంతో ఈ గడువు పొడిగింపు నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

## రాత్రి పూట ఇడ్లీ బండి పెడితే జైలేనా?

**మొదటి పేజీ తరువాయి**

విరుద్ధ సంకేతాలు పంపుతోందని విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా నైట్ షిఫ్ట్‌లలో పనిచేసే ఉద్యోగులకు తక్కువ ధరలో ఆహారం అందించే చిన్న వ్యాపారులపై చర్యలు తీసుకోవడం సరైన విధానం కాదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే పోలీసులు ఏ చట్టంలోని నిబంధనల మేరకు ఈ చర్యలు చేపట్టారు, కేసు నమోదు చేసిన కారణాలు ఏమిటన్న విషయంపై అధికారిక వివరణ రావాల్సి ఉంది. ఈ ఘటనపై సామాజిక మాధ్యమాల్లో చర్చ కొనసాగుతుండగా, వీధి వ్యాపారుల జీవనోపాధి, నిబంధనల అమలు మధ్య సమతుల్యత అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com